విలేకరులు కావలెను
ఆంధ్ర తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాలలో జిల్లాల వారీగా స్టాప్ రిపోర్టర్స్, మండల రిపోర్టర్, కంట్రిబ్యూటర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్, కావలెను
తెలుగు భాష పై అవగాహన, వార్తలు రాయగల సత్తా ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
MOBILE : 8886090199, 9885211993,

అనంత ప్రభ
తెలుగు దిన పత్రిక





# అనంత రైతాంగాన్ని బతికించండి

- ఎన్నడూ లేని విధంగా అడుగంటిన భూగర్భ జలాలు
- కళ్లెదుటే ఎండిపోతున్న పంటలు చూసి రైతుల్లో ఆందోళన
- తక్షణం రక్షక తడులు అందించి రైతాంగాన్ని ఆదుకోండి
- చంద్రబాబు సీఎం అయ్యాక జిల్లాలో 70 మందికి పైగా రైతుల ఆత్మహత్య
- ఏ ఒక్క రైతు కుటుంబానికీ అందని రూ. 7 లక్షల సాయం
- ఖరీఫ్ ముందుకొస్తుంటే కనీసం యాక్షన్ ప్లాన్ అనేది లేదా?
- వ్యవసాయమే కీలకమైన జిల్లాలో రెగ్యులర్ జేడీ నియమించుకోలేని అసమర్థ ప్రభుత్వమిది
- మార్కెట్ యార్డులున్న ప్రాంతాల్లో కమీషన్ల దందాలో ప్రజాప్రతినిధులు
- కూటమి పాలనలో రైతుల పరిస్థితి దయనీయం
- రెండేళ్లుగా రైతాంగానికి అందని ఇన్‌పుట్ సబ్సిడీ
- ఉచిత పంటల బీమాకు మంగళం పాడిన చంద్రబాబు
- యూరియా బ్లాక్‌మార్కెట్‌కు తరలించిన వాళ్లపై చర్యలేవీ?
- మొక్కజొన్న, వరి ధాన్యాన్ని కనీస మద్దతు ధరతో కొనుగోలు చేయాలి
- హంద్రీనీవా ద్వారా వచ్చిన నీళ్లు ఏమయ్యాయి?



అనంతపురం, మే 9 (అనంత ప్రభ)

కూటమి పాలనలో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఎన్నడూ లేని విధంగా జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. ఉద్యాన పంటలన్నీ ఎండిపోతున్నాయి. కన్నబిడ్డల్లా పెంచుకున్న తోటలు కళ్లెదుటే ఎండిపోతుంటే రైతులు తల్లడిల్లిపోతున్నారు" అని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ " రైతులను ఆదుకునే విషయంలో ప్రజాప్రతినిధులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండీ ఏం ప్రయోజనం? అనంతపురం జిల్లాలోని 20 మండలాల్లో నీటిమట్టాలు తగ్గిపోయాయి. ఏడు నుంచి ఎనిమిది మండలాల్లో పరిస్థితి దారుణంగా ఉంది. అయినా ఏ ప్రజాప్రతినిధికీ పట్టడం లేదు. పంటలు పరిశీలించలేదు. కనీసం రక్షక తడులు అందించాలన్న ప్రయత్నం లేదు. గతంలో ఇలాంటి పరిస్థితి ఉంటే రక్షక తడులు అందించిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు ఎందుకు అందించడం లేదు? కూటమి పాలనలో పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవు. ఎన్నడూ లేని విధంగా మామిడి, అరటి, చీనీ ధరలు పతనమయ్యాయి. రైతులకు గిట్టుబాటు కావడం లేదు కానీ, బయట మార్కెట్‌లో మాత్రం వినియోగదారులు అధిక ధరలకు కొనాల్సి వస్తోంది. జిల్లాలో మార్కెట్ యార్డులు ఉన్న ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు కమీషన్లు దండుకుంటున్నారు. చంద్రబాబు సీఎం అయ్యాక ఖరీఫ్, రబీ సీజన్లు మారుతున్నాయి తప్పితే రైతులకు గిట్టుబాటు ధరలు మాత్రం అందడం లేదు. మొక్కజొన్న కనీస మద్దతు ధర రూ.2400 ఉంటే రూ.1500 నుంచి రూ.1600కు అమ్ముకునే పరిస్థితి. వరి కోతలు ప్రారంభం అయినా ఎక్కడా మద్దతు ధరకు కొనుకోలు చేయడం లేదు. ప్రభుత్వం ప్రకటనలకు మాత్రమే పరిమితం అవుతోంది. పక్క రాష్ట్రాల్లో పంటలకు మద్దతు ధర ఇస్తున్నా ఏపీలో మాత్రం ఆ పరిస్థితి లేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏ సీజన్‌లో పంట నష్టం జరిగితే ఆ సీజన్‌లోనే రైతులను ఆదుకున్నాం. కానీ కూటమి ప్రభుత్వంలో అలాంటి పరిస్థితి లేదు. రెండేళ్లుగా ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదు. ఉచిత పంటల బీమాకు మంగళం పాడి రైతులను నష్టాల ఊబిలోకి నెట్టారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు రైతుల గురించి ఆలోచించే తీరిక లేకపోవడం శోచనీయం. ప్రజలకు ఏదో చేసేస్తున్నామని మభ్యపెట్టడానికే సీఎం చంద్రబాబు కలెక్టర్లతో సమీక్షల పేరుతో డ్రామా ఆడుతున్నారు. వ్యవసాయ రంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కనీసం సమీక్ష చేయని దయనీయ పరిస్థితి ఉంది. గతంలో హంద్రీనీవా ద్వారా 20 టీఎంసీలు వచ్చినప్పుడు కూడా భూగర్భ జలాలు ఇంతలా అడుగంటిపోయే పరిస్థితి ఎక్కడా లేదు. లోకలైజేషన్ లేని అనంతపురం చెరువుకే గతంలో నీటితో నింపాం. కానీ నేడు హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నీళ్లు తెచ్చామని గొప్పలు చెప్పడం తప్పితే ఆ నీళ్లు ఎక్కడికెళ్లాయో చెప్పలేని పరిస్థితి ఉంది. నిజంగా చెరువులను నీటితో నింపి ఉంటే ఎందుకు భూగర్భ జలాలు అడుగంటిపోతాయో ఆత్మపరిశీలన చేసుకోండి. జిల్లాకు మంత్రులు కూడా చుట్టపు చూపుగా వచ్చి వెళ్తున్నారు. మేం ఏదైనా మాట్లాడితే మాపై విమర్శలు చేస్తారు. రైతాంగం ఇబ్బందులు పడుతుంటే కళ్లుండీ కబోదుల్లా ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్నారు. జిల్లాలో రెండేళ్లుగా వలసలు కూడా ప్రారంభం అయ్యాయి. రైతాంగం ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. రెండేళ్లలో ఏకంగా 70 మంది అన్నదాతలు ఆత్మహత్య చేసుకుంటే ఏ ఒక్కరికీ రూ.7 లక్షలు చొప్పున పరిహారం ఇవ్వలేదు. వ్యవసాయం కీలకంగా ఉన్న అనంతపురం జిల్లాలో కనీసం రెగ్యులర్ జేడీని కూడా నియమించుకోలేని ప్రభుత్వమిది. గత ఏడాది కూడా రైతులు విత్తనాలు, ఎరువుల కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జూన్ 1వ తేదీ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్నా కనీసం యాక్షన్ ప్లాన్ లేదు. సబ్సిడీ ఖరారు చేయలేదు. విత్తన పంపిణీ ప్రారంభించలేదు. గత సీజన్‌కు సంబంధించి సరఫరా చేసి విత్తన బకాయిలు చెల్లిస్తేనే ఈ సీజన్‌లో విత్తనాలు సరఫరా చేస్తామని ఏజెన్సీలు ఖరాఖండిగా చెబుతున్నాయి. అయినా ప్రభుత్వంలో చలనం లేదు. గత ఏడాది యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలించిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? మెయిన్ డీలర్ల నుంచే బయటి ప్రాంతాలకు యూరియా తరలిపోయిందని తేలినా చర్యలు శూన్యం. ఇప్పటికే జిల్లాకు స్పిక్ యూరియా సరఫరా చేశారు. వచ్చిన యూరియా ఏ రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచారో తెలియని పరిస్థితి ఉంది. కేవలం రికార్డుల్లో నమోదు చేసి బ్లాక్ మార్కెట్‌కు తరలించేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రమేయం లేకుండా ఇదంతా జరుగుతుందా? జిల్లాకు ఎంత యూరియా వచ్చింది.. ఏ రైతు సేవా కేంద్రంలో ఎంత అందుబాటులో ఉంచారో అధికారులు వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా ఇంకా గత ప్రభుత్వం మీద విమర్శలు చేయడానికే పరిమితం అవుతున్నారు. ఇంకా ఎంత కాలం గత ప్రభుత్వాన్ని విమర్శిస్తారు? ప్రజాప్రతినిధులు మీ ఆదాయమార్గాల గురించే కాకుండా రైతులను ఆదుకునే ఆలోచన చేయండి. ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడంతో పాటు ఎండిపోతున్న పంటలను కాపాడుకునేందుకు తక్షణం రక్షక తడులు అందించండి. జిల్లాలో రైతాంగాన్ని, వ్యవసాయాన్ని కాపాడండి" అని అనంత వెంకటరామిరెడ్డి కోరారు

## మంత్రి సత్యకుమార్ యాదవ్ చొరవతో పేదలకు కంటి వెలుగులు

ధర్మవరం, మే 9 (అనంత ప్రభ)

ధర్మవరం నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన కంటి వైద్య సేవలు పూర్తిగా ఉచితంగా అందించాలనే సంకల్పంతో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖామంత్రి మరియు ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక చొరవ తీసుకుని నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం ద్వారా వందలాది మంది పేద ప్రజలకు కొత్త వెలుగులు ప్రసాదించబడుతున్నాయని మంత్రి కార్యాలయం శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. సంస్కృతి సేవా సమితి సహకారంతో, శంకర నేత్రాలయ (ఘుఅఝుతీఘు చీవ్ష్ట్రతీఘుశ్రీఘుఎఘు -- ఘుూా) ఆధ్వర్యంలో మొబైల్ ఐ సర్జికల్ యూనిట్ (వీజుూఖ) ద్వారా గత నెల 8వ తేదీ నుండి 17వ తేదీ వరకు నిర్వహించిన ఈ ప్రత్యేక వైద్య శిబిరంలో మొత్తం 1000 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొంది. అందులో కంటిశుక్లం సమస్యతో బాధపడుతున్న 396 మందికి అత్యాధునిక పద్ధతిలో క్యాటరాక్ట్ శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించినట్లు వెల్లడించింది. శస్త్రచికిత్సలు అనంతరం రోగుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, వారికి అవసరమైన తదుపరి వైద్య సేవలను కూడా అందిస్తున్నట్లు మంత్రి కార్యాలయం తెలిపింది. ఈ క్రమంలో శనివారం ధర్మవరం పోతుకుంట ఏరియా ఆసుపత్రిలో శంకర నేత్రాలయ నిపుణ-ులైన వైద్యులచే రెండో విడత ఫాలోఅప్ వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వివరించింది. ఈ పరీక్షల్లో భాగంగా 200 మంది లబ్ధిదారులను వైద్యులు పరిశీలించగా, వారిలో 190 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించినట్లు పేర్కొంది. వారికి తగిన విధంగా ప్రత్యేక లెన్స్‌ల కొలతలు తీసుకున్నట్లు వెల్లడించింది. ఇప్పటికే మొదటి విడతలో ఎంపికైన లబ్ధిదారులతో కలిపి మొత్తం



370 మందికి జూన్ 24న ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేయనున్నట్లు మంత్రి కార్యాలయం తెలిపింది. ఒక్కో కంటి అద్దం విలువ దాదాపు రూ.3000 వరకు ఉంటుందని, ఇంత ఖరీదైన అద్దాలను పూర్తిగా ఉచితంగా అందించడం సేవా కార్యక్రమంలో భాగంగా చేపట్టిన విశేష చర్యగా పేర్కొంది. అదేవిధంగా పరీక్షలు నిర్వహించిన 200 మందిలో మరింత ప్రత్యేక వైద్య సేవలు అవసరమైన 10 మందిని చెన్నైలోని బేస్ హాస్పిటల్‌కు రెఫర్ చేసినట్లు వెల్లడించింది. అక్కడ వారికి అవసరమైన అధునాతన చికిత్సలు, వైద్య సేవలు అందించనున్నట్లు మంత్రి కార్యాలయం వివరించింది. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక ఇబ్బందులతో నాణ్యమైన కంటి వైద్యం పొందలేక ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఈ శిబిరం ఎంతో ఉపయోగకరంగా మారిందని పేర్కొంది. మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక శ్రద్ధతో ప్రజలకు కంటి పరీక్షలు, శస్త్రచికిత్సలు, మందులు, తదుపరి వైద్య పరీక్షలు, ఖరీదైన కంటి అద్దాలు వరకు అన్నీ ఉచితంగా అందించడం పట్ల లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నట్లు మంత్రి కార్యాలయం తెలిపింది

## ధర్మవరంలో రైతు కిడ్నాప్ కేసు ఛేదించిన....వన్ టౌన్ సీఐ నాగేంద్ర ప్రసాద్

ధర్మవరం, మే 9 (అనంత ప్రభ)

ధర్మవరం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద రైతు ముసుగు నారాయణ కిడ్నాప్ ఘటనను పోలీసులు వేగంగా ఛేదించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో ఇంచార్జ్ డిఎస్పి నర్సింగప్ప మీడియాతో మాట్లాడుతూ, ముదిగుబ్బ మండలం కమ్మవారిపల్లికి చెందిన ముసుగు నారాయణకు, ధర్మవరం పట్టణానికి చెందిన కంద్యాల రవితో 1997 సంవత్సరం నుంచి భూ వివాదం కొనసాగుతోందన్నారు. ఈ వివాదంపై మూడు నెలల క్రితం నారాయణ ఆర్డీఓ కోర్టులో కేసు వేసినట్లు తెలిపారు.

ఈ నేపథ్యంలో శుక్రవారం మూడో వాయిదా కోసం ఆర్డీఓ కార్యాలయానికి వచ్చిన నారాయణను రవీందర్ నాయుడు, అతని కుమారుడు అరుణ్‌తో పాటు మరో నలుగురు కలిసి బలవంతంగా ఇన్నోవా కారులో ఎక్కించి తీసుకెళ్లినట్లు తెలిపారు.

విషయం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ నాగేంద్ర ప్రసాద్ వెంటనే అప్రమత్తమై పోలీసు సిబ్బందితో కలిసి ఇన్నోవా వాహనాన్ని వెంబడించి కుంటిమద్ది గ్రామ సమీపంలో నిందితులను అదుపులోకి తీసుకున్నారని తెలిపారు.



నిందితుల వద్ద నుంచి ఇన్నోవా వాహనం, ద్విచక్ర వాహనం, తో పాటు బాధితుడు ముసుగు నారాయణతో బలవంతంగా రాయించుకున్న ఐదు ప్రామిసరీ నోట్లు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.

నిందితులపై కేసు నమోదు చేసి, ఆరుగురిపై రౌడీషీట్లు కూడా తెరిచినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ నరసింగప్ప హెచ్చరించారు.

ఈ కేసును అత్యంత చాకచక్యంగా ఛేధించిన వన్‌టౌన్ సీఐ నాగేంద్ర ప్రసాద్ ను, ఎస్సై ఉమాదేవినీ, పోలీసు సిబ్బందిని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## బ్రహ్మసముద్రం మండలం వేపులపర్తి గ్రామంలో మహిళల భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమం

అనంతపురం, మే 9 (అనంత ప్రభ)

అనంతపురం మహిళా డీఎస్పీ ఎస్ మహబూబ్ బాషాల ఆధ్వర్యంలో వేపులపర్తిలో మహిళల భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు

ఈ కార్యక్రమంలో భారీగా మహిళలు పాల్గొని పోలీస్ శాఖ అందించిన మార్గనిర్దేశాన్ని ఆసక్తిగా స్వీకరించారు. మహిళలపై జరుగుతున్న వివిధ రకాల నేరాలు, ముఖ్యంగా గృహహింస, వేధింపులు, సైబర్ మోసాలు, బాల్య వివాహాల వంటి అంశాలపై అధికారులు వివరంగా అవగాహన కల్పించారు. అలాగే, శక్తి టీమ్ సేవలు, మహిళల కోసం అందుబాటులో ఉన్న హెల్ప్‌లైన్ నంబర్లు, పోలీస్ స్టేషన్‌లో అందించే సేవల గురించి కూడా తెలియజేశారు.

మహిళలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని, చట్టం వారికి పూర్తి రక్షణ కల్పిస్తుందని అధికారులు హితవు పలికారు. కుటుంబ మరియు సామాజిక స్థాయిలో మహిళల భద్రతకు అందరూ బాధ్యత వహించాలని సూచించారు. మహిళలు ప్రయాణాల్లో లేదా కొత్త ప్రదేశాల్లో ఉన్నప్పుడు అప్రమత్తంగా ఉండాలి. వేధింపులు లేదా అసభ్య ప్రవర్తన ఎదురైనప్పుడు భయపడకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి. పోక్సో, తదితర చట్టాలు మరియు ఆస్తి హక్కుల వంటి చట్టపరమైన అంశాలపై కనీస అవగాహన పెంచుకోవాలి. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ లేదా మెసేజ్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా బ్యాంక్ వివరాలు లేదా వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోకూడదని వివరించారు. బాల్య వివాహాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు .

– అదేవిధంగా, గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాల ద్వారా మహిళల్లో ధైర్యం, స్వీయరక్షణ భావన పెంపొందించడం పోలీస్ శాఖ ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. మహిళలు తమ హక్కులపై అవగాహన పెంపొందించుకుని,



సురక్షితమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

అనంతపురం జిల్లా పోలీస్ శాఖ మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని ఏదైనా సమస్యలు వచ్చినప్పుడు వెంటనే పరిధిలోని పోలీస్ స్టేషన్ కి లేదా 112 కి సమాచారం అందించాలని, తక్షణ సహాయం చేయడానికి పోలీస్ శాఖ ముందుంటుందని విజ్ఞప్తి చేశారు.

ఈకార్యక్రమంలో బ్రహ్మసముద్రం ఎస్ ఐ సాయికుమార్, కంబదూరు ఎస్ ఐ లోకేష్, కుందుర్పి ఎస్ ఐ మహేష్, కమ్యునిటీ హెల్త్ ఆఫీసర్ రాణి ఎస్తేర్, ఐసిడిఎస్ సూపర్వైజర్ లు ఖాసీం బీ, రామాంజినమ్మ, వెలుగు ఏపీఎం శారద, మహిళా పోలీసులు, అంగన్వాడి కార్యకర్తలు, ఏఎన్ఎం మరియు ఆశ వర్కర్లు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## మండల బూత్ స్థాయి సమావేశం నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

ఆత్మకూరు, మే 9 (అనంత ప్రభ)

రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అనంతపురం లోని తన నివాసంలో రాప్తాడు నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బూత్ కమిటీల శిబి ఎల్ ఏరి లకి మరియు శిఏస్ ఐ ఆర్‌రి పై అవగాహన సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి బూత్ స్థాయిలో బలమైన నిర్మాణం ఉండేలా బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకం తప్పనిసరి అని సూచించారు. బూత్ స్థాయి ఏజెంట్లు పార్టీకి పునాది స్తంభాలు అవుతారని, వారి చురుకైన పాత్ర పార్టీ విజయంలో కీలకమని పేర్కొన్నారు. గ్రామసా-థయిలో ప్రస్తుతం పెద్ద ఎత్తున వస్తున్న ఫారం 7 దరఖాస్తులపై బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. నకిలీ ఫారం 7లను అరికట్టడంతోపాటు, పార్టీ కార్యకర్తలు సజాగ్రత్తగా వ్యవహరించాల్సిన



అవసరాన్ని ఆయన హితవు పలికారు. అదే సమయంలో, మన పార్టీ కీ సంబందించిన తొలగించిన ఓట్లను గుర్తించి వాటిని తిరిగి చేర్చేలా కృషి చేయాలని ఏజెంట్లకు పిలుపునిచ్చారు. ప్రజల ఓటు హక్కు కాపాడడం ప్రతి కార్యకర్త బాధ్యతగా భావించాలని ఆయన గుర్తుచేశారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, రాష్ట్ర, జిల్లా నియోజకవర్గ మండల, గ్రామ అనుబంధ విభాగాలు అధ్యక్షులు, తదితులు పాల్గొన్నారు.

## నూతన గృహప్రవేశానికి హాజరైన టీడీపీ నాయకులు



యాడికి, మే 9 (అనంత ప్రభ)
యాడికి మండల కేంద్రంలోని చౌడేశ్వరి కాలనీలో వంకం నాగరాజు ప్రత్యేక ఆహ్వానం మేరకు శనివారం నిర్వహించిన నూతన గృహప్రవేశ కార్యక్రమానికి యాడికి మండల టీడీపీ నాయకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో విజన్ విద్యాసంస్థల అధినేత విశ్వనాథ్, టీడీపీ మండల కన్వీనర్ దడియాల ఆదినారాయణ, మండల టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు తిరంపురం నీలకంఠ, కూన వెంకటస్వామి, దాసరి తిరు, వీరేష్,లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. నూతన గృహప్రవేశం సందర్భంగా నాగరాజు దంపతులను అభినందించిన నాయకులు వారికి ప్రత్యేక బహుమతిని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు

## వేసవి తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి జిల్లా కలెక్టర్ ఎ. శ్యాంప్రసాద్



పుట్టపర్తి, మే 9 (అనంత ప్రభ)
కలెక్టరేట్ లోని మినీ కన్ఫరెన్స్ హాలు నందు జిల్లాలో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా గ్రామస్థాయిలో ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యాంప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఆర్ డబ్ల్యు ఎస్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన కీలక సూచనలు చేశారు. ఆర్ డబ్ల్యు ఎస్ వన్ ఆప్, వాటర్ ట్రాన్స్‌పోర్టేషన్ రిపోర్టులను ప్రతిరోజూ అప్డేట్ చేస్తూ, గ్రామాల వారీగా నీటి సరఫరాను పర్యవేక్షించాలి. నీటి కొరత ఉన్న చోట వెంటనే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని, అవసరమైతే ప్రైవేట్ బోర్లను వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పైపులైన్లు, మోటార్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి. నీటి నమూనాలను పరీక్షించి, క్లోరినేషన్ ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడాలి. జల్ జీవన్ మిషన్ పనులను వేగవంతం చేయాలని, జిల్లాలో నిర్మాణంలో ఉన్న 271 కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్సులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.
"నీటి సమస్యల విషయంలో రాజీ పడకూడదు, ప్రజలకు కనీసం 55 ఎల్ పి సిడి నీరు అందేలా చూడాలి" అని కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.
ఈ కార్యక్రమం లో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ మురళీధర్, గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు, ఇంజినీర్లు మరియు సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు

## ఎండాకాలంలో నీటి సమస్యను పరిష్కరించండి


కళ్యాణదుర్గం, మే 9 (అనంత ప్రభ)
కళ్యాణదుర్గం నియోజకవర్గం ఆయా పలు మండలాల్లో ఎండాకాలం తీవ్రతబట్టి తీవ్ర నీటి దడి నెలకొంది ఈ వేసవిలో ఎండదృష్ట నీటి సమస్యను పరిష్కరించాల్సిందిగా పలు గ్రామాల ప్రజలు సంబంధిత అధికారులకు అర్జీలు సమర్పిస్తున్నప్పటికీ మార్గం సుగమం లేదు అయితే ఇటీవల నీటి సరఫరా కోసం ఆయా కార్మికులు ఆయా తమ జీతభత్యాల కోసం నెలలు తరబడి వివిధ కార్యక్రమాలతో ధర్నాలు నిరసనలు చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోగా వారు వివిధ రకాలుగా నిరాహార దీక్షలు చేస్తూ వ్యతిరేక విధానాలు పాటిస్తున్నారు అయితే ప్రభుత్వ ధోరణి అధికారులతో సమన్వయం లోపించడంతో అటు కార్మికులు వారి సమస్యలు తోపాటు ప్రజల ఎండ వేడిమి నీటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నప్పటికీ దానికి సంబంధిత అధికారులు స్పందించకపోవడం ఏమిటనేది సమస్యగా మారింది అయితే ఇప్పటికైనా సంబంధిత అధికారులు సత్య సాయి నీటి సరఫరా కు సంబంధించి ధర్నా కార్యక్రమాలను విరమించే విధంగా ఎండాకాలంలో తీవ్ర నీటి ఎద్దడిని నివారించే విధంగా తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజలు కోరుకుంటున్నారు

## లక్ష్మమ్మ అవ్వ జాతరలో ఘనంగా ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం




ఆదోని, మే 9 (అనంత ప్రభ)
ఆదోని నియోజకవర్గంలోని మహాయోగి లక్ష్మమ్మ నగర్‌లో లక్ష్మమ్మ అవ్వ జాతర సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. టిడిపి యువ నాయకులు కొంక భూపాల్ చౌదరి, కొంక సిద్ధార్థ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో స్థానిక ప్రజలు, భక్తులకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో టిడిపి ఇందిరా నగర్ ఇంచార్జి ఐసీ రామకృష్ణ పాల్గొని నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వలి, రంగన్న, గౌస్, శరభ, రాజేష్, అంగడి కిట్ట, శేఖర్, అంజి, నరసప్ప, నాగరాజు, మంగన్న, శెట్టిబలిజ కృష్ణ, మురళి తదితరులతో పాటు వార్డ్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతరను విజయవంతం చేశారు.

## ప్రాణాలకన్నా మిన్నగా నిలిచిన తల్లి ప్రేమ



యాడికి, మే 9 (అనంత ప్రభ)
మధ్యప్రదేశ్‌లోని బర్గీ డ్యామ్ వద్ద గత నెల 30వ తేదీన జరిగిన పడవ ప్రమాదం దేశవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ప్రమాదం అనంతరం గంటల పాటు సాగిన గాలింపు చర్యల్లో బయటపడిన ఓ దృశ్యం ప్రతి ఒక్కరి హృదయాలను కదిలిస్తోంది. శోధన బృందాలకు కనిపించిన ఆ దృశ్యంలో ఓ తల్లి తన చిన్నారిని గట్టిగా ఒడిలో చేర్చుకుని కనిపించింది. అలలతో పోరాడుతూ, ప్రాణాలతో యుద్ధం చేస్తూ చివరి క్షణం వరకు తన బిడ్డను విడిచిపెట్టని ఆ తల్లి ప్రేమ అందరినీ భావోద్వేగానికి గురి చేసింది. ఆ కౌగిలిలో భయం ఉంది, ఆందోళన ఉంది, కానీ వాటన్నింటికంటే ఎక్కువగా కనిపించింది తల్లి ప్రేమ. ప్రాణాపాయ స్థితిలో కూడా తన బిడ్డను రక్షించాలనే తపనతో చివరి శ్వాస వరకు పోరాడిన ఆమె మాతృత్వానికి ఈ ఘటన నిలువెత్తు నిదర్శనంగా మారింది. దురదృష్టవశాత్తు తల్లీకొడుకులు ఇద్దరూ ప్రాణాలతో బయటపడలేకపోయినా, వారి మధ్య ఉన్న ఆ అనుబంధం మాత్రం ప్రతి ఒక్కరి మనసుల్లో చెరగని ముద్ర వేసింది. ఆ ఒక్క ఫోటో ఇప్పుడు వేల మాటలు చెబుతోంది, తల్లి అంటే ఏమిటో, తల్లి ప్రేమ ఎంత గొప్పదో ప్రపంచానికి తెలియజేస్తోంది. మాతృదినోత్సవం సందర్భంగా ఈ విషాద ఘటన ప్రతి ఒక్కరికీ భావోద్వేగ పాఠాన్ని నేర్పుతోంది. తల్లి ప్రేమకు ఎలాంటి కొలమానం ఉండదని, అది మాటల్లో చెప్పలేనిదని, త్యాగంలోనే అర్థమయ్యేదని మరోసారి గుర్తు చేస్తోంది.

## 11 సంవత్సరాల బాలుడిని తల్లి చెంతకు చేర్చిన హిందూపురం టూ టౌన్ పోలీసులు



హిందూపురం, మే 9 (అనంత ప్రభ)
బెంగళూరుకు చెందిన రోషన్ (11 సం॥లు), తండ్రి భాష, నివాసం ఆర్.టి నగర్ పరిధిలోని పుష్పనహళ్లి ప్రాంతం, మూడు రోజుల క్రితం తన ఇంటి నుంచి ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి లోకల్ రైలు ద్వారా హిందూపురంకు చేరుకున్నాడు. అనంతరం బాలుడు హిందూపురం పట్టణంలోని రహమత్పూర్ ప్రాంతంలో తిరుగుతుండగా, స్థానిక మెకానిక్ ఇమ్రాన్ గమనించి మానవత్వంతో హిందూపురం టూ టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బందికి అప్పగించారు.
పోలీసులు బాలుడిని విచారించగా, తన తల్లి పేరు "యాస్మిన్" మరియు "పుష్పనహళ్లి" ప్రాంతం అని మాత్రమే చెప్పగలిగాడు. ఫోన్ నంబర్ లేదా పూర్తి చిరునామా వంటి వివరాలు తెలియజేయలేని పరిస్థితి ఉండటంతో, పోలీసులు సాంకేతిక ఆధారాలు మరియు ప్రత్యేక సమాచార సేకరణ ద్వారా బాలుడి తల్లి యాస్మిన్ తాజ్ చిరునామాను గుర్తించి ఆమెను సంప్రదించారు.
దీనిపై స్పందించిన యాస్మిన్ తాజ్ బెంగళూరు నుంచి హిందూపురంకు చేరుకోగా, ఈ రోజు బాలుడు రోషన్‌ను సురక్షితంగా ఆమెకు అప్పగించారు.
ఈ సందర్భంగా బాలుడిని క్షేమంగా గుర్తించి తల్లి చెంతకు చేర్చడంలో సహకరించిన రహమత్పూర్‌కు చెందిన మెకానిక్ ఇమ్రాన్‌ను, సి. ఐ. కరీం, ఎస్ఐ లింగన్న లు అభినందించారు. ఈ సందర్భంగా సిఐ కరీం మాట్లాడుతూ
ప్రజలు తమ పిల్లలపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని, పిల్లలు కనిపించకపోతే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు

## వీరశైవుల ఐక్యతే హక్కుల సాధనకు మార్గం




ఆదోని, మే 9 (అనంత ప్రభ)
రాష్ట్ర వీరశైవ జంగమ మహేశ్వరుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదోని పట్టణంలో వీరశైవ జంగమ మహేశ్వరుల చైతన్య సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వీరశైవ మరియు జంగమ కార్పొరేషన్ చైర్మన్లు వాసునూరి చంద్రశేఖర్, తుల్జాపూర్ స్వప్న హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు ఐదు లక్షల మంది వీరశైవ జంగములు ఉన్నప్పటికీ ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ హక్కులను సాధించుకోవాలంటే వీరశైవ జంగములు ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. వీరశైవ దేవాలయాల్లో వీరశైవులకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కార్పొరేషన్ చైర్మన్లను కోరారు. అలాగే వీరశైవ జంగముల ఆరాధ్యదైవమైన శ్రీశైలం దేవస్థానంలో పీఠాధిపతులకు, వీరశైవ జంగములకు సరైన గౌరవం కల్పించకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వీరశైవులను ఒక్కతాటిపైకి తీసుకువచ్చేందుకు భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని నాయకులు అభిప్రాయపడ్డారు. జంగం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ శ్రీశైలంలో శైవ ధర్మాలకు విరుద్ధంగా దేవాదాయ శాఖ కార్యక్రమాలు నిర్వహించడం మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన ఇంచార్జి ఎన్. మల్లప్ప, రాష్ట్ర వీరశైవ జంగం సంఘం నాయకులు, వీరశైవులు, జంగములు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముస్లిం మైనారిటీ విద్యార్థులకు సువర్ణ అవకాశం తాలిం-ఏ-హునర్ టాలెంట్ టెస్ట్‌తో ఉచిత రెసిడెన్షియల్ విద్య - గడ్డా ఫక్రుద్దీన్



ఆదోని, మే 9 (అనంత ప్రభ)
ముస్లిం మైనారిటీ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా "తాలిం-ఏ-హునర్ టాలెంట్ టెస్ట్" కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని టిడిపి ఏపీ రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి గడ్డా ఫక్రుద్దీన్ తెలిపారు. శుక్రవారం ఆదోనిలో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడారు. కుల, మతాలకు అతీతంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాత్రింబవళ్లు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. పేద ముస్లిం విద్యార్థులకు ఉన్నత విద్య అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చారని తెలిపారు. ఈ టాలెంట్ టెస్ట్ ద్వారా ఎంపికైన విద్యార్థులకు పూర్తిగా ఉచిత రెసిడెన్షియల్ ఇంటర్మీడియట్ విద్యతో పాటు ఐఐటి, జేఈఈ, నీట్, ఎంసెట్ వంటి పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఉత్తమ కళాశాలల్లో విద్య, హాస్టల్ సదుపాయం, భోజనం, పుస్తకాలు, ట్యూషన్ ఫీజులు అన్నీ పూర్తిగా ఉచితంగా కల్పించనున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా టాప్ 250 మంది విద్యార్థులను పూర్తిగా మెరిట్ ఆధారంగా ఎంపిక చేయనున్నట్లు వివరించారు. 2025-26 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తిచేసిన ముస్లిం బాలబాలికలు ఈ పరీక్షకు అర్హులని తెలిపారు. అభ్యర్థులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నివాసితులై ఉండడంతో పాటు తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండాలని పేర్కొన్నారు. పరీక్ష ఈ నెల 24న ఓఎంఆర్ విధానంలో నిర్వహించబడుతుందని, 100 మార్కులకు మూడు గంటలపాటు పరీక్ష ఉంటుందని చెప్పారు. పదో తరగతి సిలబస్‌లోని మాథ్స్, ఫిజికల్ సైన్స్, నేచురల్ సైన్స్, కెమిస్ట్రీ అంశాలపై ప్రశ్నలు ఉంటాయని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 6 నుంచి ప్రారంభమై, 14వ తేదీతో ముగియనున్నట్లు చెప్పారు. విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని ఆన్‌లైన్ అప్లికేషన్ పూర్తి చేయాలని సూచించారు. ప్రక్కన ఇచ్చిన క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. "మీ భవిష్యత్తును మెరుగుపర్చుకునే ఈ అద్భుత అవకాశాన్ని ప్రతి ముస్లిం విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలి" అని గడ్డా ఫక్రుద్దీన్ పిలుపునిచ్చారు. మరిన్ని వివరాల కోసం కర్నూలు జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ సయ్యద్ సోహెల్‌ను సంప్రదించాలని తెలిపారు

## యాడికిలో అండర్16 స్కూల్ ఛాంపియన్ క్రికెట్ టోర్నమెంట్

యాడికి, మే 9 (అనంత ప్రభ)
యాడికి మండలంలోని చిన్నారుల్లో దాగి ఉన్న క్రికెట్ ప్రతిభను వెలికి తీయాలనే లక్ష్యంతో అండర్16 స్కూల్ ఛాంపియన్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ టోర్నమెంట్ మే 16 నుంచి మే 25 వరకు యాడికిలోని జడ్‌పి హై స్కూల్ గ్రౌండ్‌లో జరగనుంది. 11 నుంచి 16 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన బాలురు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొనడానికి అర్హులని పేర్కొన్నారు. ప్రతి జట్టులోని ఆటగాళ్లు 16 సంవత్సరాల లోపే ఉండాలని, ఆధార్ కార్డు ద్వారా వయస్సు ధృవీకరణ తప్పనిసరిగా ఉంటుందని తెలిపారు. ఈ పోటీల్లో కేవలం యాడికి మండలపరిధిలోని గ్రామాలకు చెందిన క్రీడాకారులకు మాత్రమే అవకాశం కల్పిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. విజేత జట్టుకు విన్నర్ కప్, రన్నరప్ జట్టుకు రన్నర్ కప్ అందజేయనున్నారు. అదే విధంగా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, బెస్ట్ బ్యాట్స్‌మన్, బెస్ట్ బౌలర్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డులను కూడా ప్రదానం చేయనున్నారు. ఈ టోర్నమెంట్‌కు ఎటువంటి ఎంట్రీ ఫీజు లేదని, చిన్నారుల్లోని క్రీడా నైపుణ్యాన్ని ప్రోత్సహించడం మరియు ప్రతిభావంతులైన ఆటగాళ్లను గుర్తించడం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.

## ధర్మవరం రూరల్‌లో కేబుల్ వైర్ దొంగలు అరెస్ట్




ధర్మవరం, మే 9 (అనంత ప్రభ)
ధర్మవరం రూరల్ పోలీస్ స్టేషన్ నందు రూరల్ సీఐ ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని పొలాల్లో కేబుల్ వైర్లు దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.
ధర్మవరం మండలంలోని పలు గ్రామాల్లో సుమారు 100 మీటర్ల కేబుల్ వైర్‌ను దొంగిలించి విక్రయిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు పోలీసులు ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో లోకేష్, రాకేష్ అనే ఇద్దరు నిందితులను రూరల్ ఎస్ఐ రాజశేఖర్ అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నట్లు తెలిపారు.
నిందితుల వద్ద నుంచి కేబుల్ వైర్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ప్రభాకర్ వెల్లడించారు. లోకేష్‌పై ధర్మవరం, అనంతపురం జిల్లాల్లో 8 కేసులు, రాకేష్‌పై 13 కేసులు నమోదై ఉన్నాయని పేర్కొన్నారు. వీరిద్దరినీ కోర్టులో హాజరు పరుస్తున్నట్లు సీఐ తెలిపారు

## శ్రీ మహాత్మ జ్యోతిబాపూలే భవనానికి స్థలం కేటాయించాలి ఎంపీ బస్తిపాటి నాగరాజుకు బీసీ ఫెడరేషన్ వినతి



ఆదోని, మే 9 (అనంత ప్రభ)
ఆదోని డివిజన్ బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కర్నూలు పార్లమెంట్ సభ్యుడు బస్తిపాటి నాగరాజును కలిసి శ్రీ మహాత్మ జ్యోతిబాపూలే భవనం (బీసీ భవన్) ఏర్పాటు చేయాలని బీసీ నాయకులు వినతి పత్రం సమర్పించారు. మహాయోగి లక్ష్మమ్మ అవ్వ జాతర సందర్భంగా ఆదోనికి వచ్చిన ఎంపీని కలిసి బీసీ భవన్ నిర్మాణానికి స్థలం కేటాయించి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరి నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 150 బీసీ కులాలు ఉన్నాయని, ఆదోని డివిజన్‌లో సుమారు 25 ప్రధాన బీసీ కులాలకు చెందిన ప్రజలు నివసిస్తున్నారని తెలిపారు. వారికి సమావేశాలు నిర్వహించేందుకు మీటింగ్ హాల్, లైబ్రరీ, స్ఫూర్తి కేంద్రం వంటి సౌకర్యాలు లేవని పేర్కొన్నారు. అందువల్ల ఆదోని రెవెన్యూ డివిజన్ కేంద్రంలో శ్రీ మహాత్మ జ్యోతిబాపూలే భవనం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో పలుమార్లు వినతి పత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం 50 సెంట్ల స్థలం కేటాయించి భవన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కురువ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, డైరెక్టర్ రామకృష్ణ, బిల్డింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆరెకల్ రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ కత్తి హనుమంతరావు, మహర్షి స్కూల్ అధినేత విజయ్, బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ఆదోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో యువశక్తి కబడ్డీ టీం ఆధ్వర్యంలో సౌత్ ఇండియా కబడ్డీ టోర్నమెంట్



ఆదోని, మే 9 (అనంత ప్రభ)
ఆదోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో యువశక్తి కబడ్డీ టీం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన సౌత్ ఇండియా కబడ్డీ టోర్నమెంట్ క్రీడాభిమానులను ఆకట్టుకుంది. ఈ టోర్నమెంట్‌కు మొదటి బహుమతిగా కొంకా ఉమాపతి నాయుడు తనయుడు కొంక సిద్ధార్థ నాయుడు రూ.50 వేల నగదు బహుమతిని అందజేశారు. రెండో బహుమతిగా ఠాకూర్ చౌదరి రూ.30 వేల నగదు బహుమతిని క్రీడాకారులకు ప్రోత్సాహకంగా అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ యువత క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని, కబడ్డీ వంటి గ్రామీణ క్రీడలకు మరింత ప్రోత్సాహం అందించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, మార్కెట్ యార్డ్ కమిటీ డైరెక్టర్లు, సభ్యులు, క్రీడాభిమానులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. టోర్నమెంట్ నిర్వహణలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కాశన్న, రాజు, గోపాల్, వెంకటేష్, లక్ష్మన్న, అమర్ ప్రకాష్ కీలక పాత్ర పోషించారు









## సమ్మర్‌లో ఈ కోల్డ్ కాఫీలతో బరువు తగ్గడం ఖాయం..



కాఫీ.. ఉదయాన్నే ఇది గొంతులో పడనిదే చాలా మందికి చాలా పనులు అవ్వవు. అంతలా దీనికి అడిక్ట్ అయిపోతారు. ఓ రకంగా ఇది స్ట్రెస్ బస్టర్ చాలా మందికి. దీనిని తాగడం వల్ల చాలా లాభాలు ఉన్నాయి. అయితే, ఏదైనా ఎప్పుడు, ఎలా, ఎంత తీసుకోవాలో అలానే చేయాలి. లేకపోతే రిజల్ట్స్ తేడా కొడతాయి. ఇప్పుడు ఈ సమ్మర్‌లో నార్మల్ కాఫీ కాకుండా, వెయిట్ తగ్గించే వెయిట్ లాస్ గురించి తెలుసుకుందాం.

కోల్డ్ కాఫీ..

ఈ కాఫీని కొద్ది మంది ఇష్టపడతారు. అయితే, సమ్మర్‌లో వేడిని తగ్గించి రిఫ్రెష్‌గా ఫీల్ అయ్యేందుకు కాఫీ లవర్స్ నార్మల్ కాఫీ బదులు దీనికి షిఫ్ట్ అవుతారు. దీనిని తాగడం వల్ల ఓ మైనస్ పాయింట్ ఏంటంటే.. ఇది క్యాలరీలను అమాంతం పెంచుతుంది. అయితే, అలా కాకుండా ఈ రుచిని ఆస్వాదిస్తూనే.. బరువు తగ్గాలంటే కొన్ని స్పెషల్ కాఫీల గురించి మీరు తెలుసుకోవాల్సిందే.

కోల్డ్ బ్రూయింగ్..

ఈ కాఫీ గింజలను గది ఉష్ణోగ్రత కంటే తక్కువగా ఉన్న నీటిలో 20 గంటల కంటే ఎక్కువసేపు ఉంచి తయారు చేస్తారు. దీనిని ఇంట్లోనే ఈజీగా ఎలా చేయాలంటే మీరు చేయాల్సిదిల్లా 1:12 నిష్పత్తితో రాత్రి నీటిలో కాఫీ గింజలను ఉంచి వాటిని మిక్సీ పట్టండి. దీనిని మీరు ఓ కేజి వరకూ చేసుకుని ఫ్రిజ్‌లో కూడా పెట్టుకోవచ్చు. దీనిని తీసుకుని కాఫీలా చేసుకుని పాలు లేకుండా. తీపి కోసం షుగర్, బెల్లం పొడి, తేనె వేసుకోవచ్చు. అయితే లేకుండా తాగితే బెటర్. ఒక వేళ తాగలేమనుకుంటే కాస్తా తక్కవు పరిమాణంలో షుగర్ ఆల్టర్నేటివ్స్ వేసి కొద్దిగా నిమ్మరసం వేసుకుని తాగండి. దీని వల్ల బరువు తగ్గుతారు.



దాల్చిన చెక్క కాఫీ..



దాల్చిన చెక్కలో ఎన్నో గుణాలు ఉన్నాయి. అవి బరువుని ఈజీగా తగ్గిస్తాయి. కప్పు బ్లాక్ కాఫీకి ఎస్ప్రెస్సో షాట్, చిటికెడు దాల్చిన చెక్క పొడి కలపండి. దీని వల్ల ఫ్యాట్‌ని కరిగించే కాఫీని తయారు చేసుకోవచ్చు. దీని వల్ల మెటబాలిజం పెరుగుతుంది. దాల్చిన చెక్కలోని యాంటీ ఆక్సిడెట్స్ కెఫిన్‌తో కలిసి బరువు తగ్గించడాన్ని స్పీడ్‌గా చేస్తుంది.

## వేసవిలో రాగి జావ తాగితే ఎనర్జీతో పాటు ఆరోగ్యం కూడా



వేసవికాలంలో త్వరగా నీరసించిపోతారు. ఎండలో కాసేపు అలా వెళ్లివచ్చారంటే ఎనర్జీ అంతా కోల్పోయి నీరసంగా మారిపోతారు. అలాగే ఎండాకాలంలో ఏమీ తినాలనిపించదు. ఎక్కువగా దాహం వేస్తూ ఉంటుంది. అలా అని ఏదీ తినకుండా ఉంటే త్వరగా నీరసించిపోతాం. ఎండాకాలంలో డీహైడ్రేషన్ కు గురికావడం, వడదెబ్బ బారిన పడటం ఎక్కువగా జరుగుతుంది. వేసవికాలంలో ఉదయం తీసుకునే ఆహారం రోజంతా హుషారుగా పని చేయడానికి కావాల్సిన శక్తిని అందించేలా ఉండాలి. అందుకే వేసవి కాలంలో రాగి జావ తాగాలని న్యూట్రిషనిస్టులు సూచిస్తుంటారు. దీని వల్ల తక్షణ శక్తి రావడంతో పాటు, రోగనిరోధక శక్తి మెరుగుపడటం, శరీరానికి కావాల్సిన పోషకాలను అందిస్తుంది.

కాల్షియం సమృద్ధిగా ఉంటుంది: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ స్టడీస్ ప్రకారం, ఇతర మిల్లెట్లు ధాన్యాలతో పోలిస్తే రాగుల్లో కాల్షియం ఎక్కువగా ఉంటుంది. పాలు కాకుండా కాల్షియం ఎక్కువగా ఉండేది రాగుల్లోనే. డయాబెటిస్ నియంత్రణలో సహాయపడుతుంది: గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వల్ల ఆకలి తక్కువగా వేస్తుంది. జీర్ణక్రియ వేగాన్ని మెయింటైన్ చేస్తుంది. రక్తంలో చక్కెర పరిధిని నియంత్రణలో ఉంచుంతుంది. రక్తహీనతతో పోరు: రాగుల్లో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. రక్తహీనత ఉన్న వారు, తక్కువ హిమోగ్లోబిన్ స్థాయిలు ఉన్న వారికి రాగి జావ ఒక వరం లాంటిది. ఇందులోని ఐరన్ రక్తహీనతను తగ్గిస్తుంది.

బరువు తగ్గడంలో సహాయం: రాగుల్లో అధిక మొత్తంలో ఉండే డైటరీ ఫైబర్ పొట్టను ఎక్కువసేపు నిండుగా ఉంచుతుంది. దీని వల్ల ఆకలి తగ్గుతుంది. ఇలా బరువు తగ్గడానికి దారితీస్తుంది. చర్మం సంరక్షణ: రాగుల్లో ఉండే మెథియోనిన్, లైసిన్ వంటి కీలక అమైనో ఆమ్లాలు చర్మ కణజాలాన్ని కాపాడతాయి. చర్మం ముడతలు పడకుండా చూస్తాయి. శరీరాన్ని రిలాక్స్ చేస్తుంది: ఆందోళన, డిప్రెషన్, నిద్రలేమితో బాధపడుతున్న వారు క్రమం తప్పకుండా రాగులు తీసుకుంటే మంచి ఫలితం ఉంటుందని మెడ్ ఇండియా 2000లో నిర్వహించిన అధ్యయనం పేర్కొంది. గ్లూటెన్ ఉండదు: గోధుమలతో పోలిస్తే రాగులు చాలా సులభంగా జీర్ణమవుతాయి. ఇందులో గ్లూటెన్ ఉండదు. ఇది శరీరంలో మరింత ఆల్కలీన్ మీడియంను సృష్టిస్తుంది.

రాగి జావ తయారీ విధానం: లి రాగి పిండిని ముందుగా కొన్ని నీళ్లలో వేసి ఉండలు లేకుండా కలుపుకోవాలి. లి మరో గిన్నె తీసుకుని అందులో నీళ్లు పోసి స్టవ్ పై పెట్టుకోవాలి. లి నీళ్లు మరిగేటప్పుడు ముందుగా నీటిలో ఉండలు లేకుండా కలిపి పెట్టుకున్న రాగి పిండిని ఈ నీటిలో వేసుకోవాలి. లి తగినంత ఉప్పు, తగినంత మజ్జిగ వేసుకోవాలి. లి ఆ మిశ్రమం దగ్గరికి వచ్చేంత వరకు కలుపుతూ ఉండాలి. లి తర్వాత స్టవ్ పై నుండి దించి చల్లార్చుకోవాలి. లి కొత్తిమీర, పుదీనా వేసుకుంటే రాగి జావ సిద్ధమైనట్లే. లి కొద్దిగా కారంగా కావాలనుకుంటే కారం వేసుకుని రాగి జావను తాగొచ్చు.

## వడదెబ్బ తగిలిన వెంటనే చేయాల్సిన ప్రథమ చికిత్స ఇదే

అధిక వేడిని శరీరం తట్టుకోలేక వడదెబ్బ బారిన పడుతుంది. శరీరంలో ఎలక్ట్రోలైట్స్ తగ్గి, డీహైడ్రేషన్ బారిన పడడం వల్ల వడదెబ్బ కలుగుతుంది. బయట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నప్పుడు శరీరం తనలోని వేడిని నియంత్రించుకోలేక విఫలమవుతుంది. అలాంటి సమయంలోనే వడదెబ్బలాంటి ప్రాణాపాయ పరిస్థితులు ఏర్పడతాయి. వెంటనే ప్రథమ చికిత్స చేస్తే వారిని ప్రాణాపాయ పరిస్థితి నుంచి కాపాడుకోవచ్చు.

వడదెబ్బ లక్షణాలు


వడదెబ్బ తగిలిన వెంటనే శరీర ఉష్ణోగ్రత పెరిగిపోతుంది. ఒక్కోసారి 104లీ ఫారెన్ హీట్ దాటుతుంది. అపస్మారక స్థితిలోకి చేరుకుంటారు. గుండె వేగంగా కొట్టుకోవడం, శ్వాస వేగంగా లేదా తక్కువగా తీసుకోవడ, రక్తపోటు పెరగడం లేదా తగ్గడం, చెమట పట్టకపోవడం, వికారం, వాంతులు కావడం, స్పృహ కోల్పోవడం వంటివన్నీ జరుగుతాయి. వడదెబ్బ తగిలిన వెంటనే ప్రాథమిక చికిత్సను అందిస్తే వారిని కాపాడుకోవచ్చు.

ప్రథమ చికిత్స ఇలా...

వడదెబ్బ తగిలిన రోగిని చల్లని నీటిలో ముంచిన వస్త్రంతో తుడవాలి. అలా శరీరం అంతా తుడుస్తూ ఉండడం వల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గుతూ ఉంటుంది. శరీర ఉష్ణోగ్రత 101 డిగ్రీలు వచ్చే వరకు అలా చల్లని నీటితో వస్త్రంతో తుడుస్తూ ఉండాలి. చల్లని పానీయాలను అందించాలి. ఎటువంటి మందులు ఇవ్వకూడదు. గాలి తగిలేచోట ఉంచాలి. ఉప్పు కలిపిన మజ్జిగ లేదా గ్లూకోజ్ వాటర్ లో కాస్త ఉప్పు కలిపి తాగించడం మంచిది. ఓఆర్ఎస్ అందుబాటులో ఉంటే దాన్ని తాగిస్తే ఎంతో మేలు. ఈ పనులు చేస్తూనే మరోపక్క ఆసుపత్రికి తీసుకెళ్లే ఏర్పాట్లు కూడా చేయాలి. ఎందుకంటే కొంతమందిలో వడదెబ్బ తీవ్రంగా కొడితే ప్రాణానికే ప్రమాదం కావచ్చు.

ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

ఎండలు పెరిగిపోతున్న ఈ కాలంలో వడదెబ్బ కొట్టకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. బయట ఉష్ణోగ్రత అధికంగా ఉన్న సమయంలో ఎక్కువసేపు ఎండకు గురవ్వకపోవడమే మంచిది. బయటికి వెళ్లే ముందు చల్లని పానీయాలు తాగి వెళ్లాలి. కాఫీ, టీలకు దూరంగా ఉండాలి. మద్యాన్ని పూర్తిగా మానేయాలి. లేత రంగులో ఉండే వస్త్రాలు ధరించాలి. అవి వదులుగా ఉండేలా చూసుకోవాలి. ఎండలో బయటికి వెళ్లినప్పుడు వాటర్ బాటిల్ దగ్గర ఉంచుకోవడం అన్ని విధాలా మంచిది.



ఎండలు పెరుగుతున్నప్పటినుంచి రోజూ మజ్జిగ తాగడం అలవాటు చేసుకోవాలి. వడదెబ్బను తట్టుకునే శక్తిని పానీయాలు అందిస్తాయి. చల్లని పానీయాలు, మజ్జిగ తాగడం వల్ల శరీరంలో ఎలక్ట్రోలైట్స్ పడిపోకుండా ఉంటాయి. వేసవిలో ఆహారపు అలవాట్లను కూడా మార్చుకోవడం మంచిది. దాహాన్ని పెంచేసే మాంసాహారాన్ని, మసాలా నిండిన ఫుడ్‌కు, స్పైసీ ఫుడ్‌కు దూరంగా ఉండటం మంచిది.

## డస్ట్ అలర్జీ ఉందా.. ఇంటిని ఇలా క్లీన్ చేయండి..

అలర్జీ.. చాలా సమస్యలకి ఈ చిన్న సమస్య కారణం. దీని వల్ల ఎన్నో ఇబ్బందులు ఎదురవుతాయి. ఇంట్లోని చిన్న దుమ్ము వల్ల ఈ సమస్య ఎక్కువగా వస్తుంది. అలాంటప్పుడు ప్రతి మూలని చక్కగా క్లీన్ చేయడం అనేది చాలా ముఖ్యం. కానీ, మనం అలా చేయలేం. ఎలా క్లీన్ చేయాలో తెలియదు. అలాంటివారికి ఓ అవగాహన కోసమే ఈ టిప్స్.

**ఇంట్లోని క్రిములే కారణం..**

ఆస్తమా, ఇతర బ్రీథింగ్ ప్రాబ్లమ్స్ రావడానికి ఇంట్లోని దుమ్ము కారకాలు ముఖ్య కారణం. వీటిని తొలగిస్తే చాలా వరకూ సమస్యలు దూరమవుతాయి. అందుకే ఎప్పటికప్పుడు ఇంటిని క్లీన్ చేస్తుండాలి. ఎంత క్లీన్ చేసినా, చేసే టైమ్‌లో, చేశాక కూడా కొన్ని క్రిముల వల్ల చాలా సమస్యలు వస్తాయి. అలాంటి వారు కొన్ని టిప్స్ పాటించడం మంచిది.

**మాస్క్..**

ఇల్లు క్లీన్ చేసేటప్పుడు మాస్క్ వాడాలి. ముఖ్యంగా అలర్జీ వంటి సమస్యలు ఉన్నవారు డిస్పోజబుల్, ఉతికిన మాస్క్‌లను వాడండి. ఇవి కూడా స్కిన్ ఫ్రెండ్లీగా ఉండాలి. చర్మానికి ఇబ్బంది పెట్టకుండాలి. కాటన్ మాస్క్‌లు వాడండి.

**క్లీన్ చేశాక..**

చాలా మంది మైక్రోఫైబర్ క్లాత్స్, కాటన్ టవల్స్‌తో ఇంటిని క్లీన్ చేస్తుంటారు. వీటితో క్లీన్ చేశాక చక్కగా వాటిని నీటితో ఉతకడం మంచిది. మాప్స్ హెడ్స్ క్లీన్ చేయాలి. ఎప్పటికప్పుడు మాప్ హెడ్స్ క్లీన్ చేయడం మంచిది.

**డిస్పోజబుల్ మంచివి..**

సింథటిక్ డస్టింగ్ వైప్స్ వంటి వాటికి దుమ్ము త్వరగా ఆకర్షిస్తాయి. అందుకే వీటిని వాడాక మళ్ళీ వాడకపోవడమే మంచిది. ఇవి తక్కువ ధరకే లభించడమే కాకుండా క్రిములని కూడా



దూరం చేస్తాయి. కాబట్టి వీటిని వాడడం చాలా మంచిది.

**క్లీనర్స్..**

చాలా మంది క్లీనింగ్ కోసం డిటర్జెంట్స్, స్టెయిన్ రిమూవల్ ప్రోడక్ట్స్ తీసుకుంటారు. అయితే, వాటిని వాడే ముందు లేబుల్స్ చేయడం మంచిది. ఇవి కూడా సువాసన లేనివి ప్లేన్‌వి తీసుకోవడం మంచిది. వైట్ వెనిగర్, బేకింగ్ సోడాతో కూడా క్లీన్ చేయొచ్చు. వీటిలో చక్కగా నిమ్మరసం కలిపి క్లీన్ చేయండి.

**వారానికి ఓసారి దుప్పట్లు..**

చాలా మంది పడక బట్టల్ని అంతగా పట్టించుకోరు. కానీ, ఎక్కువగా అలర్జీ కారక క్రిములు వీటిపైనే ఉంటాయి. కాబట్టి, వీటిని కచ్చితంగా వారానికి ఓసారైనా క్లీన్ చేయాలి. క్లీన్ చేశాక కచ్చితంగా ఎండలో ఆరబెట్టాలి.

## కళ్లు బాగా కనిపించాలంటే.. ఇవి కచ్చితంగా తినాలి..!



మన శరీరంలోని జ్ఞానేంద్రియాల్లో అతి ముఖ్యమైనవి కళ్లు. కళ్లు సరిగ్గా పనిచేయకపోతే.. ఏ పని సరిగ్గా చేయలేం. చదవడానికి, రాయడానికి, సాధారణ పనులు చేయడానికీ కష్టంగా మారుతుంది. ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితులు, కాలుష్యం, ఆహారపు అలవాట్లు, లైఫ్‌స్టైల్, మొబైల్ ఫోన్ల వాడకం కారణంగా.. దృష్టి సమస్యలతో భాదపడేవారి సంఖ్య రోజు-రోజుకూ ఎక్కువవుతోంది. దృష్టి సమస్యలతో బాధపడేవారు, కంటి చూపును రక్షించుకోవాలనుకునేవారు.. వారి డైట్ ఏ పోషకాలు చేర్చుకోవాలో ఈ స్టోరీలో చూద్దాం

**లుటిన్, జియాక్సంతిన్..**

లుటిన్, జియాక్సంతిన్ మన కంటిలో ఉండే.. కెరోటినాయిడ్లు. ఇవి సూర్యరశ్మి నుంచి కంటిని రక్షిస్తాయి. ఇవి లైట్ ఫిల్టర్‌గా పనిచేస్తాయి, యూవీ కిరణాల వల్ల కంటి కణజాలాలు దెబ్బతినకుండా కాపాడతాయి. అరోగ్యకరమైన కంటి కణాలకు హాని చేసే ఫ్రీ రాడికల్స్, అన్‌స్టేబుల్ మాలిక్యూల్స్ నుంచి జియాక్సంతిన్ రక్షిస్తుంది. లుటిన్ జియాక్సంతిన్ పొందడానికి.. మీ డైట్‌లో ముదరు ఆకుపచ్చ కూరలు, గుడ్లు, పసుపు, ఆరెంజ్ రంగు పండ్లు, బ్రోకలీ, మొక్కజొన్న, బఠానీ, కాలే వంటి ఆహార పదార్థాలు తీసుకోండి.
విటమిన్ సి ని ఆస్కార్బిక్ యాసిడ్ అని కూడా అంటారు. విటమిన్ సి ఆక్సిజన్ తీసుకోవడం, కంటి లోపల ఆక్సిజన్ తక్కువ స్థాయిని నిర్వహించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. లెన్స్, విట్రస్‌లో ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడానికి, కంటి శుక్లాలం ప్రమాదాన్ని తగ్గించడానికి విటమిన్ సి సహాయపడుతుంది. విటిమిన్ సి అధికంగా ఉండే... కివి, క్యాప్సికమ్, టమాటా, బ్రోకలీ, పాలకూర, జామ కాయ, సిట్రస్ పండ్లు, ద్రాక్ష పండ్లు మీ ఆహారంలో చేర్చుకోండి.

AP 4PG 10- 5- 2026 SUNDAY qxp_Layout 1 09-05-2026 09:30 PM Page 4



# 250 ఏళ్ల కంపెనీకి బ్రాండ్ అంబాసిడర్‌గా శ్రీలీల.. రెమ్యునరేషన్ ఎన్ని కోట్లంటే?





కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన మైసూర్ శాండల్ సోప్‌కు స్టార్ హీరోయిన్ తమన్నా భాటియాను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడంపై కన్నడ సీమ రగిలిపోతోన్న సంగతి తెలిసిందే. దాదాపు 6.2 కోట్ల పారితోషికంతో తమన్నాకు ఈ బాధ్యతను కట్టబెట్టింది సిద్ధరామయ్య ప్రభుత్వం. అయితే కర్ణాటకలో ఎంతో మంది ప్రముఖులు, ప్రతిభావంతులు ఉండగా పరాయి రాష్ట్రానికి చెందిన నటిని మైసూర్ శాండల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడం వివాదానికి దారి తీసింది. కర్ణాటక సంఘాలు, పార్టీలు, ప్రముఖులు ప్రభుత్వ తీరును తప్పుబడుతున్నారు. ఈ క్రమంలో కర్ణాటకకి చెందిన యువ కథానాయిక శ్రీలీల అదిరిపోయే ఆఫర్ అందుకున్నారు. ఈ వివరాల్లోకి వెళితే..

చేతినిండా సినిమాలతో శ్రీలీల బిజీ ప్రస్తుతం టాలీవుడ్‌లో బిజీగా ఉన్న హీరోయిన్ ఎవరంటే ఖచ్చితంగా వినిపించే పేరు శ్రీలీల. ధమాకాతో లైమ్ లైట్‌లోకి వచ్చిన ఈ ముద్దగుమ్మ ఆ తర్వాత భగవంత్ కేసరి, గుంటూరు కారం వంటి భారీ బడ్జెట్ సినిమాల్లో అవకాశాలు దక్కించుకుంది. ఇక పుష్ప 2లో కిస్సిక్ సాంగ్‌తో దేశాన్ని ఊపేసి నేషనల్ వైడ్ పాపులర్ అయ్యింది. అందం, అభినయం, డ్యాన్స్‌తో క్రేజీ ఆఫర్లు పట్టేస్తోంది. చాలా చిన్న వయసులోనే బాలీవుడ్ ఆఫర్ కూడా అందుకోవడంతో శ్రీలీల అదృష్టంపై సీనియర్ హీరోయిన్లు, అప్ కమింగ్ హీరోయిన్లు అసూయ పడుతున్నారు. ఏళ్లుగా నిరీక్షిస్తున్న తమ వల్ల కానిది శ్రీలీల ఈజీగా సాధిస్తోందని కుళ్లుకుంటున్నారు.

ఆషికి 3తో బాలీవుడ్‌లోకి బాలీవుడ్ స్టార్ హీరో కార్తీక్ ఆర్యన్ సరసన ఆషికి 3 అనే సినిమా ద్వారా బాలీవుడ్‌లో అడుగుపెడుతున్నారు శ్రీలీల. అనురాగ్ బసు ఈ చిత్రానికి దర్శకుడు. దీపావళి కానుకగా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నారు. దీనిలో భాగంగా శరవేగంగా సినిమాను పరుగులు పెట్టిస్తున్నాడు అనురాగ్. అయితే అషికి 3 ఇంకా సెట్స్ మీద ఉండగానే శ్రీలీల హిందీలో మరో ఆఫర్ అందుకున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. మరో స్టార్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రా సరసన శ్రీలీల ఆడిపడనుందట. ఆనంద్ ఎల్ రాయ్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. రాజ్ సాండియాలా దర్శకత్వం వహిస్తారని బీటౌన్ టాక్. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఇక తెలుగులో జూనియర్, మాస్ జాతర, లెనిన్, తమిళంలో పరాశక్తి సినిమాలలో శ్రీలీల నటిస్తున్నారు.

టాప్ బ్రాండ్స్‌కు అంబాసిడర్‌గా సినిమా హిట్, ఫ్లాపులతో సంబంధం లేకుండా శ్రీలీల వరుస అవకాశాలు అందుకుంటున్నారు. ఇక బ్రాండ్ అండార్స్‌మెంట్స్‌తోనూ ఈ ముద్దుగుమ్మ భారీగా సంపాదిస్తోందట. న్యూడ్ స్కిన్ కేర్, అమృత గ్రూప్, ప్రెస్టా వుమెన్స్ వేర్, నీరూస్ తదితర బ్రాండ్స్‌కు శ్రీలీల అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. తాజాగా శ్రీలీల అండార్స్‌మెంట్స్ కెరీర్‌లోనే మైల్ స్టోన్ అనదగ్గ ఆఫర్ వచ్చింది.

శ్రీలీలతో యూకే కంపెనీ డీల్ పర్సనల్ కేర్, కాస్మోటిక్స్, ఫ్రాగ్‌రెన్సెస్ విభాగంలో ప్రపంచంలోని అగ్రగామి సంస్థల్లో ఒకటైన యార్డ్లే లండన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. లండన్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ కంపెనీకి దాదాపు 255 ఏళ్ల చరిత్ర ఉండగా.. ప్రపంచంలోని అత్యంత పురాతన కంపెనీల్లో ఒకటిగా యార్డ్లేకు పేరుంది. 2009లో యార్డ్లేను భారత కార్పోరేట్ దిగ్గజం విప్రో ఎంటర్‌ప్రైజెస్ కొనుగోలు చేసింది. ఇంతటి చరిత్ర కలిగిన ఈ సంస్థలోని ఫ్రాగ్‌రెన్సెస్ విభాగానికి గాను భారత్‌లో శ్రీలీల ప్రమోట్ చేయనుండటం విశేషం.

పారితోషికం ఎంతంటే? అయితే ఇందుకు గాను శ్రీలీల ఎంత మొత్తంలో పారితోషికం అందుకుంటున్నారన్నది తెలియరాలేదు. ప్రస్తుతం బ్రాండ్ ప్రమోషనింగ్ కోసం రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల మధ్య శ్రీలీల ఛార్జ్ చేస్తుండటంతో ఇది కూడా అదే స్థాయిలో లేదా ఆపైనా ఉండే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. యార్డ్లే నుంచి శ్రీలీల పారితోషికంగా ఎంత మొత్తం వసూలు చేస్తున్నారనే దానిపై త్వరలోనే మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది.




## చిరంజీవికి అలా.. బాలయ్యకు ఇలానా? అల్లు అరవింద్‌నే అడగండి..



మెగా ఫ్యామిలీ, అల్లు కుటుంబానికి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకొన్నాయనే విషయాల గురించి మీడియాలో ఎక్కువగా చర్చ జరుగుతున్నది. ఈ రెండు కుటుంబాలు నర్మగర్భంగా మాట్లాడే తీరు ఆ వివాదాస్పద అంశానికి బలం చేకూరేలా కనిపిస్తుంటుంది. అయితే సాధారణ ప్రజలకు ఆ కుటుంబాల మధ్య గతంలో ఉన్న సఖ్యత, బంధాలు లేవనే అపోహ మాత్రం ఏర్పడింది. అయితే ఈ విషయాలపై రెండు కుటుంబాలకు ఆప్తుడైన తండేల్ నిర్మాత బన్నీ వాసు వెల్లడించిన వివరాల్లోకి వెళితే..

ఇటీవల కాలంలో అల్లు ఫ్యామిలీకి నందమూరి బాలకృష్ణ అత్యంత చేరువైనట్టు బయట వాళ్లకే కాకుండా సినిమా వర్గాలకు అనిపిస్తుంది. అయితే ఈ క్రమంలో బాలయ్యకు పద్మభూషణ్ అవార్డు రావడంపై అన్ని వర్గాల నుంచి స్పందన వ్యక్తమైంది. అయితే సినీ పరిశ్రమ ఈ సందర్భాన్ని పురస్కరించుకొని భారీ సమావేశాన్ని ఏర్పాటు చేసి.. ఆయనకు సన్మానం చేయాలనే ఆలోచనలో సినిమా పరిశ్రమ ఉందనే వార్త ఫిలిం నగర్‌లో చక్కర్లు కొడుతున్నది.


అయితే బన్నీ వాసును ఈ విషయంపై మెగాస్టార్ చిరంజీవికి పద్మభూషణ్ వస్తే ఎలాంటి సన్మానం చేయలేదు. మెగా హీరోలు, మెగా కుటుంబం పెద్దది అనే ఫీలింగ్ ఇండస్ట్రీలో ఉంది. ఆ సన్మాన కార్యక్రమాన్ని ఎందుకు నిర్వహించలేదని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు ఆయన సరైన రీతిలో స్పందించారు.

పద్మ భూషణ్ అవార్డు అందుకొన్నందుకు చిరంజీవికి సన్మానం చేయకపోవడం.. బాలకృష్ణకు చేయాలనే ప్లాన్ చేయడం లాంటి విషయాలను అరవింద్ గారి లాంటి పెద్ద వాళ్లను అడిగితే బాగుంటుంది. అది చాలా పెద్ద విషయం. నా వయసుకు, నా స్థాయికి మాట్లాడే విషయం కాదు. అరవింద్ గారినే అడిగితే మంచింది. ఈ పరిస్థితుల్లో నేను ఏం మాట్లాడినా బాగుండదు. ఆ విషయం గురించి నేను మాట్లాడితే కరెక్ట్ కాదు అంటూ బన్నీ వాసు తప్పించుకొన్నారు.

నంద్యాల వివాదం తర్వాత నాకు, పవన్ కల్యాణ్‌కు మధ్య గ్యాప్ వచ్చిందనే విషయం సరికాదు. అందులో వాస్తవం లేదు. పవన్ కల్యాణ్ మెచ్యూరిటీ లెవెల్స్ వేరేగా ఉంటాయి. ఆయన ఇలాంటి విషయాలను మనసులో పెట్టుకోని చూడరు. ఎవరు ఏం చేస్తున్నారు? ఎవరు ఎలాంటి వారు? అనేది ఆయనకు ఫుల్లుగా క్లారిటీ ఉంది. నా విషయంలో ఆయన బన్నీతో కలిపి చూడరు. పార్టీకి ఏం చేస్తున్నాను? పార్టీ కోసం ఎలా ఉంటున్నారనేది ఆయన చూస్తారు అని బన్నీ వాసు వివరణ ఇచ్చారు.

# మహేష్ బాబు వదిలేసిన 1800 కోట్ల సినిమా.. థియేటర్లు బద్దలయ్యేవి.. ఆ మూవీ ఏంటంటే?





సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం ఇండియాస్ బిగ్గెస్ట్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్ లోనే మూడవ షెడ్యూల్ జరుగుతోంది. చిత్రీకరణ విషయంలో మాత్రం జక్కన్న ఎస్. ఎస్. ఎం.బి 29 సినిమాను శరవేగంగా కొనసాగిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. మలయాళం సూపర్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస్తున్నారని తెలుస్తోంది. ఇదిలా ఉంటే మహేష్ బాబు చివరిగా గుంటూరు కారం చిత్రంతో ప్రేక్షకులను అలరించిన సంగతి తెలిసిందే. అది సూపర్ స్టార్ మహేష్ బాబు ఇప్పటివరకు రెగ్యులర్ క్యారెక్టర్లలోనే నటిస్తూ వచ్చారు. కానీ అభిమానులు మాత్రం ఆయనను పవర్ఫుల్ రోల్స్ లో చూడాలని ఎంతగానో ఆశిస్తున్నారు. ఈ క్రమంలోనే మహేష్ బాబు వదిలేసుకున్న 1870 కోట్ల సినిమా గురించి తాజాగా న్యూస్ బయటకు వచ్చింది. ఆ సినిమా చేసి ఉంటే మాత్రం మహేష్ బాబు ఇండియా ను షేక్ చేసే వారిని సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

ఇంతకీ ఆ సినిమా ఏంటో తెలిస్తే అందరూ షాక్ అవ్వాల్సిందే. క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కాంబినేషన్లో వచ్చిన పుష్ప చిత్రమే కావడం విశేషం. అయితే ఈ సినిమాకు మొదట హీరోగా మహేష్ బాబు అని అనుకున్నట్టుగా ఇప్పుడు తెలుస్తోంది. కానీ మహేష్ బాబు ఆ సినిమాలు వదులుకోవడంతో అల్లు అర్జున్ వద్దకు వెళ్లిందని ఫిల్మ్ సర్కిల్స్ లో గుసగుసలు నడుస్తున్నాయి. ఇక అల్లు అర్జున్ టెర్రిఫిక్ పెర్ఫార్మెన్స్ తో పుష్ప, పుష్ప 2 చిత్రాలు ఎంతటి సెన్సేషన్ క్రియేట్ చేశాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

రీసెంట్ గా వచ్చిన పుష్ప 2 చిత్రం ఏకంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసింది. 1870 కోట్లు గ్రాస్ కలెక్ట్ చేసి ఇండియాలోనే హైయెస్ట్ గ్రాస్ కలెక్ట్ చేసిన రెండవ సినిమాగా రికార్డు సెట్ చేసింది. బాహుబలి 2 సాధించిన బాక్సాఫీస్ కలెక్షన్లు 1810 కోట్లను దాటేసి మరి ఈ రికార్డును సెట్ చేయడం సెన్సేషన్ గా మారింది. మన వైపు అల్లు అర్జున్ కు పుష్ప పాత్రలో నటించినందుకు ఏకంగా బెస్ట్ యాక్టర్ విభాగంలో నేషనల్ అవార్డు వరించిన సంగతి తెలిసిందే. ఇక నెక్ట్స్ పుష్ప 3 కూడా రాబోతుంది. ఆ పార్ట్ లో విజయ్ దేవరకొండ నటిస్తారని తెలుస్తోంది.

అయితే ఇంతటి సెన్సేషన్ క్రియేట్ చేసిన పుష్ప చిత్రాన్ని మహేష్ బాబు ఎందుకు వదులుకున్నారా అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ క్వశ్చన్ గా మారింది. అయితే పుష్ప చిత్రం ప్రారంభానికి ముందు మహేష్ బాబు ఇంట్లో వరుసగా విషాదాలు నెలకొనడం, గుంటూరు కారం చిత్రం తర్వాత ఎస్ఎస్ రాజమౌళి తో సినిమాకు కమిట్ అవ్వడమే కారణం అని తెలుస్తుంది. ఇక పుష్ప చిత్రమే కాదు, శంభాజీ మహారాజ్ జీవిత కథతో వచ్చిన చావా చిత్రాన్ని కూడా మహేష్ బాబు వదిలేసారంట. ఈ హిస్టారికల్ ఫిలిం లో మహేష్ బాబు నటించిన మాత్రం మరింత బీభత్సం సృష్టించే వారిని ఫ్యాన్స్ అభిప్రాయపడ్డారు. ఇలా తన ముందుకు వచ్చిన రెండు బ్లాక్ బస్టర్ మూవీస్ ను మహేష్ బాబు వదులుకోవడం ఆసక్తికరంగా మారింది. ఎస్. ఎస్. ఎం.బి 29 తో మాత్రం ఇండియన్ బాక్సాఫీస్ రికార్డులను చెల్లాచెదురు చేస్తారని ఫ్యాన్స్ నమ్ముతున్నారు. ఆ ప్రాజెక్టుకు మార్కెట్లోనూ భారీ డిమాండ్ ఉండింది.

# భైరవం మూవీ రివ్యూ అండ్ రేటింగ్

వీపురంలో జమీందార్ వంశానికి చెందిన గజపతి (మనోజ్ మంచు)కి గ్రామంలో పేరు ప్రతిష్టలు ఉన్నప్పటికీ.. పేదరికం వెంటాడుతుంటుంది. గజపతికి తన ఊరిలోనే పెద్దరికాన్ని ప్రదర్శించే వరద (నారా రోహిత్), అనాథగా బతికే శ్రీను (బెల్లంకొండ శ్రీను) ప్రాణస్నేహితులుగా ఉంటారు. ఇదిలా ఉండగా, ఆ గ్రామంలోని ఆలయ ధర్మకర్తగా గజపతి నానమ్మ (జయసుధ) ఉంటారు. ఆలయ భూములు కాజేయడానికి మంత్రి (శరత్ లోహితస్య) పన్నాగం పన్నుతాడు.

అనాథ అయినప్పటికీ శ్రీనును కన్నబిడ్డగా ప్రజలు ఎందుకు చూస్తారు? శ్రీనుతో వెన్నెల (అదితి శంకర) లవ్ ట్రాక్ ఎలా సాగింది? గజపతిని భార్య నీలిమ (ఆనంది) ఎలా వేధించింది. భార్య ఒత్తిళ్లకు గజపతి తన మనసును ఎలా మార్చుకొన్నాడు. ప్రాణస్నేహితులుగా ఉండే గజపతి, వరద, శ్రీను మధ్య మంత్రి ఎలా చిచ్చు పెట్టారు. వరద స్నేహం కోసం ప్రాణాలిచ్చేంత ప్రేమ ఉన్న గజపతి తన స్నేహితులకు ఎందుకు ఎదురు తిరిగాడు? వరద, గజపతి, శ్రీను మధ్య విభేదాలు ఎలాంటి పరిస్థితులకు దారి తీశాయి? అనే ప్రశ్నలకు సమాధానమే భైరవం సినిమా కథ.

పోలీస్ ఇన్స్‌పెక్టర్ (సంపత్ రాజ్) తన ఉద్యోగానికి రాజీనామాను పై అధికారికి సమర్పించడంతో సినిమా హై నోట్‌లో మొదలవుతుంది. తన రాజీనామాకు కారణం చెప్పడం మొదలు పెట్టడంతో దేవీ పురంలో ముగ్గురు ప్రాణ స్నేహితుల కథను ఎమోషనల్‌గా దర్శకుడు ప్రారంభించాడు. ముగ్గురు హీరోల ఇంట్రడక్షన్, ఎలివేషన్స్‌ను బాగానే డిజైన్ చేశాడు. ఆ తర్వాత శ్రీను ప్రేమ కథ, వరద, గజపతి ఫ్యామిలీ మధ్య ఉండే అన్యోన్యతను, కథను ఎస్టాబ్లిష్ చేయడానికి కాస్త టైమ్ ఎక్కువగా తీసుకొన్నట్టు అనిపిస్తుంది. ఫస్టాఫ్‌ను రెగ్యులర్, రొటీన్ ఫార్మాట్‌తో నడిపించినప్పటికి.. ఇంటర్వెల్ ముందు పవర్‌ఫుల్ ఎపిసోడ్‌తో తొలిభాగాన్ని ముగించి సెకండాఫ్‌పై ఆసక్తిని పెంచాడు.

అయితే ముగ్గురు హీరోల మధ్య ఎమోషన్స్, బాండింగ్‌ను బలంగా ఎస్టాబ్లిష్ చేయాల్సి ఉన్నప్పటికీ.. ఆ దిశగా ప్రయత్నం సరిగా చేయలేదనే ఫీలింగ్ కలుగుతుంది. భావోద్వేగంతో చెప్పాల్సిన సన్నివేశాల్లో యాక్షన్ నింపడం వల్ల సినిమాలో సోల్ కాస్త మిస్ అయిందనిపిస్తుంది. ఇలాంటి లోపాలు ఉన్నప్పటికీ.. మామిడితోట సీన్ నుంచి మూవీలో సన్నివేశాలు నెక్ట్స్ రేంజ్‌లోకి వెళ్తాయి. క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరించిన తీరు విజయ్ కనకమేడల ప్రతిభ ఎంతో తెలుస్తుంది. సెకండాఫ్‌ను ఇంకాస్త బెటర్‌గా డిజైన్ చేయాల్సిందనే ఫీలింగ్ కలుగుతుంది. నటీనటుల ఫెర్ఫార్మెన్స్ విషయానికి వస్తే.. బెల్లంకొండ శ్రీనివాస్ ఈ సినిమాకు బ్యాక్ బోన్‌గా నిలిచాడు. సినిమాలోని ఎమోషనల్ కంటెంట్‌ను తన పాత్ర ద్వారా బాగా ఎలివేట్ చేశాడు. నటుడిగా మరింత మెచ్యూరిటీని చూపించాడు. ప్రీ క్లైమాక్స్ నుంచి క్లైమాక్స్ సన్నివేశాల్లో తనలోని నట విశ్వరూపాన్ని చూపించే ప్రయత్నం చేశాడు. నారా రోహిత్, మనోజ్‌తో పాత్రలతో మమేకమై మంచి బాండింగ్‌ను ఆన్ స్క్రీన్‌పై ఎలివేట్ చేశాడు. ఇక మనోజ్ మంచు నటుడిగా మరో రేంజ్ పెర్ఫార్మెన్స్ చేశాడు. కాస్త విరామం తీసుకొన్నప్పటికీ.. సూపర్ క్యారెక్టర్‌తో రీ ఎంట్రీతో అదరగొట్టాడు. ఇండస్ట్రీలో తన టైమ్ స్టార్ట్ అయిందని గజపతి పాత్ర ద్వారా చాటి చెప్పాడు. నారా రోహిత్ విషయానికి వస్తే.. వరద పాత్రలో హుందాగా కనిపించాడు. తన పాత్రకు ఎంత ఎమోషన్ కావాలి? ఎంత యాక్షన్ కావాలో అంతే సమతుల్యాన్ని పాటించి సటిల్‌గా స్క్రీన్ పై కనిపించాడు. ఇక నాన్నమ్మగా జయసుధ పాత్ర అంతంత మాత్రమేగానే ఉన్నప్పటికీ.. స్క్రీన్ మీద కనిపించినంత సేపు ఆమె ప్రజెన్స్ బాగుంది. ఈ సినిమా కథను నడిపించే పాత్రలో నీలిమగా ఆనంది నటన బాగుంది. కేవలం గ్లామర్ పరంగానే కాకుండా ఆనంది పాత్రల స్వరూపాన్ని, సినిమా కథ దిశను మార్చే పాత్రలో ఒదిగిపోయింది. ఇక నారా రోహిత్ భార్య పాత్రలో పూర్ణిమగా దివ్య పిళ్లై ఎమోషనల్ కంటెంట్‌ను సినిమాకు అందించే విధంగా పెర్ఫార్మ్ చేశారు. వెన్నెల కిషోర్ కామెడీ పెద్దగా వర్క్ కాలేదు. సంపత్ రాజ్, శరత్, అజయ్, ఇతర పాత్రలు సినిమాలో గుర్తుంచుకొనే పాత్రల్లో కనిపించారు.

టెక్నికల్ అంశాల విషయానికి వస్తే.. ఈ సినిమాకు శ్రీ చరణ్ పాకాల మ్యూజిక్ ప్రధానమైన బలంగా మారింది. బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తోనే కాకుండా హీరోల ఇంట్రడక్షన్ సాంగ్ సంక్రాతి పాట, అలాగే వెన్నెల, గిచ్చు గిచ్చు సాంగ్ ఆడియో పరంగా ఫుల్ జోష్‌ను కలిగిస్తే.. తెర మీద అదే జోష్‌ను చూపించారు. ఇక ఈ సినిమాలో మంచి మాస్ యాక్షన్ ఎపిసోడ్స్ ఉన్నాయి. వాటితో గ్రామంలోని వాతవరణాన్ని హరి కె వేదాంతం చక్కగా, చాలా సహజంగా చిత్రీకరించాడు. కేకే రాధామోషన్ ఈ మూవీని రాజీ లేకుండా మంచి క్వాలిటీతో సినిమాను అందించారు. ప్రొడక్షన్ వాల్యూస్ హై స్టాండర్డ్‌లో ఉన్నాయి. కంటెంట్‌పై మరింత దృష్టిపెట్టి ఉంటే బెస్ట్ మాస్ యాక్షన్ మూవీ అయి ఉండేదనిపిస్తుంది. తమిళంలో సూపర్ హిట్ అయిన గరుడన్ సినిమాకు భైరవం రీమేక్. ఈ సినిమాలో అన్ని రకాలు ఎమోషన్స్ ఉంటాయి. కొన్ని చోట్ల భావోద్వేగాలు లోపించాయి. యాక్షన్ పార్ట్ సినిమా ఫ్లేవర్‌ను మార్చేసింది. పాటల బాగున్నప్పటికీ వాటి ప్లేస్‌మెంట్ సరిగా లేకపోవడం వల్ల మంచి ఫ్లోలో వెలుతున్న స్టోరికి బ్రేకులు వేశాయా? అనిపిస్తుంది. ఈ సినిమా పక్కా మాస్ ఎంటర్‌టైనర్. బెల్లంకొండ శ్రీను, నారా రోహిత్, మనోజ్ మంచు ఫెర్ఫార్మెన్స్ ఈ సినిమాకు హైలెట్. కథ పరంగా పాత కథే.. కాకపోతే డిఫరెంట్‌గా చేయాలన్న ప్రయత్నం కొంత ట్రాక్ తప్పింది. టోటల్‌గా ఈ సినిమాను థియేటర్‌లో ఓసారి చూసేయొచ్చు అనేది నా అభిప్రాయం.




PRINTED, PUBLISHED & and OWNED by T VIJAYANAND, And PRINTED at M/S JBN PUBLICATIONS, # 2/381-A - RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. Published at M/S JBN PUBLICATIONS, # 2/381-A, RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. PIN - 515411. Editor T VIJAYANAND, RNI NO: APTEL/2015/72694. Cell : 8886090199. E-mail ID : ananthaprabha@gmail.com